క్లుప్తంగా

అంజన్నకు ప్రత్యేక పూజలు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని రణమండల ఆంజనేయస్వామికి ఆషాఢమాసం రెండో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింధూరసేవ, తులసీ హారం, నైవేద్యం, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజలను కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

శాకాంబరి అలంకారంలో యల్లమ్మవ్వ

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని యల్లమ్మ కొండలో వెలిసిన శ్రీ రేణుకాయల్లమ్మవ్వ ఆషాఢమాస ఉత్సవాల్లో భాగంగా రెండో మంగళవారం శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వెండి, బంగారం, పూల అలంకారం, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాకాంబరి అలంకారంలో యల్లమ్మవ్వను కూరగాయలతో అలంకరించారు.

గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన

ఆదోని అర్బన్: పట్టణంలోని కోటనగర్‌లో మారెమ్మవ్వ ఆలయంలో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దాతల సాయంతో మారెమ్మ, సుంకులమ్మ, పోతురాజు తదితర విగ్రహాలను ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం రథోత్సవాన్ని పురవీధులగుండా నిర్వహించారు.

కరణిలో కంటి వైద్య శిబిరం

కౌతాళం: మండల పరిధిలోని కరణి గ్రామంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ పుష్పలత, వైఎస్సార్‌సీపీ నాయకుడు గోవిందు ఆధ్వర్యంలో కర్నూలు అమీలియా ఆసుపత్రి వైద్యులు రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 20మందికి ఆపరేషన్లు అవసరం కాగా వారిని కర్నూలుకు రెఫర్ చేసినట్లు చేసినట్లు వైద్యుడు ఈరన్న తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో 20మందికి ఆపరేషన్ చేస్తామని, కంటి అద్దాలు అందజేస్తామని ఆయన తెలిపారు.

హమాలీ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆదోని రూరల్: ఇటీవల మృతిచెందిన స్థానిక సెంట్రల్ వేర్‌హౌస్ హమాలీ కార్మికుడు బోయ చంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ సీనియర్ నాయకులు బి.మహానంద రెడ్డి, పట్టణ కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షులు లక్ష్మన్న డిమాండ్ చేశారు. మంగళవారం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం సీడబ్ల్యూసీ గోడౌన్ మేనేజర్‌ను కలిసి బాధిత కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందేలా చూడాలని కోరారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.మారెన్న, దానప్ప, హమాలీలు కిష్టప్ప, రాము, బి.శంకర్, ఉరుకుందు, హమాలీలు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

ఆదోని రూరల్: ఈనెల 30న విజయవాడలో జరిగే రైతుల మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతుసంఘం నాయకులు మంగళవారం విరుపాపురం, గోనభావి, సాదాపురం, దిబ్బనకల్, సలకలకొండ, అలసందగుత్తి, బసరకోడు, నెట్టేకల్, సాంబగల్లు, బైచిగేరి, ఆరేకల్ తదితర గ్రామాల్లో ఆటో జాతా చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి అయ్యప్ప, అధ్యక్షుడు శేఖర్, సభ్యుడు తిక్కన్న మాట్లాడుతూ గత ఏడాది కల్తీ పత్తి విత్తనాల వల్ల, అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ట్యాంకుతో తాగునీటి సరఫరా

కౌతాళం: మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామ ప్రజలకు తాగునీటిని ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు. గ్రామానికి తాగునీరు అందించే రక్షిత మంచినీటి ఎస్ఎస్ ట్యాంకులో నీరు లేకపోవడంతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సూచన మేరకు సర్పంచ్ తులసీ, గ్రామ ఇన్‌చార్జ్ ఏకాంబర్‌రెడ్డి ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ ట్యాంకుకు నీరు వచ్చే వరకు నీటి సరఫరా కొనసాగిస్తామని తెలిపారు.

నేడు అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని వి.తిమ్మాపురం గ్రామంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం వ్యవస్థాపకుడు చిక్కం జానయ్య పిలుపునిచ్చారు. విగ్రహం ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ మెంబర్ కట్టిపోగు బసవరాజు రానున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగేష్, విజయ్‌కుమార్, జగన్, సుందర్‌రాజు పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

మంత్రాలయం రూరల్: బక్రీద్ పండుగను ముస్లిలు శాంతియుతంగా జరుపుకోవాలని మాధవరం పోలీసు స్టేషన్ ఎస్ఐ కిరణబాబు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మాధవరం పోలీసు స్టేషన్‌లో మాధవరం, రచ్చుమర్రి గ్రామాల ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ అందరు కలసిమెలసి పండుగను చేసుకోవాలన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా పండుగను పండుగలా జరుపుకోవాలని సూచించారు.

అమ్మలకు అండగా..

విద్యార్థుల తల్లులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. పిల్లల చదువు ఖర్చులకు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం ద్వారా అమ్మల ఖాతాల్లో నగదు జమ చేస్తూ ఆదుకుంటున్నారు. అందులో భాగంగా నాల్గో విడత అమ్మ ఒడి నిధులను బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా నుంచి జగనన్న బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. – ఆదోని సెంట్రల్


పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

- నేడు అమ్మ ఒడి పథకం కింద నగదు జమ
- పట్టణంలో 34,592 మంది విద్యార్థుల తల్లులకు లబ్ధి

ఆదోని పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో 1 నుంచి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులు 31,592 మంది ఉన్నారు. ఆయా కళాశాలల్లో ఇంటర్ చదివే విద్యార్థులు 3,000 మంది దాకా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.14,000 చొప్పున తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తోంది. ఇచ్చిన మొత్తాన్ని పిల్లల అవసరాలు నిమిత్తం ఉపయోగించుకుంటున్నారు. ప్రతి పిల్ల వాన్ని చదివించడానికి తల్లులు ముందుకు వస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు దూరం

పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు ఇబ్బందులు పడేవారు. చాలా మంది చదివించలేక పిల్లలను చదువులు మాన్పించిన సందర్భాలూ లేకపోలేదు. జగనన్న తన పాదయాత్రలో పిల్లలను చదివించడానికి తల్లులు పడే కష్టాలను చూసి అమ్మ ఒడి కార్యక్రమం చేపట్టారు. పేదలు మధ్యతరతి వారి మీద ఆర్థిక భారం పడకూడదని జగనన్న విద్యా దీవెన పథకం కింద దుస్తులతో పాటు పుస్తకాల నుంచి బూట్ల వరకు అన్నీ ఉచితంగా ఇస్తున్నారు. పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం రాగి జావాతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. అమ్మ ఒడి డబ్బు పడాలంటే జూలై 10 లోపు తప్పని సరిగా ఈకేవైసీ చేయించాలి.

పిల్లల అవసరాలకు ఉపయోగిస్తాం



మాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురూ చదువుకుంటున్నారు. గౌతమ్ పేరు మీద మూడేళ్లగా ఏటా రూ.14,000 చొప్పున అందుతోంది. ముగ్గురిని చదివించాలంటే ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వచ్చిన డబ్బులను వృథా చేయకుండా వారి అవసరాలకే ఉపయోగిస్తున్నాం. – భారతి, విద్యార్థి తల్లి

ఎంతగానో ఉపయోగ పడుతుంది



మాకు ఇద్దరు పిల్లలు. ఒక అమ్మాయి పేరు మీద అమ్మ ఒడి డబ్బు ఏటా రూ.14000 చొప్పున రెండేళ్లగా అందుకుంటున్నాం. ఈ డబ్బు పిల్లల చదువులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. గతంలో పుస్తకాలు కొనాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. – శారదమ్మ, విద్యార్థి తల్లి

ఈకేవైసీ చేయించాలి



విద్యార్థుల తల్లిదండ్రులు తప్పని సరిగా ఈకేవైసీ చేయించాలి. ఎవరైనా చేయకపోతే సచివాలయానికి వెళ్లి వలంటరీ యాప్‌లో చేయించండి. జూలై 10వ తేదీ వరకు గడువు ఉంది. పాఠశాలలో గానీ, జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులు తల్లుల పేర్లు ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేయాడానికి జూలై మొదటి వారంలో ఆప్షన్ ఇస్తారు. సరైన పత్రాలు తీసుకుని సచివాలయానికి వెళ్తే వాటిని సరిచేస్తారు. – బి.శివరాములు మండల విద్యాధికారి.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

ఆదోని అర్బన్: స్థానిక డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో మొదటి సంవత్సరం డిగ్రీ ప్రవేశానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని అధ్యయన కేంద్రం కో–ఆర్డినేటర్ పి.మురళీమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, డిప్లొమా, ఐటీఐ పాస్ అయిన విద్యార్థులు నేరుగా దరఖాస్తు చేసుకునేందుకు జూలై 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. రెండో సంవత్సరం, మూడో సంవత్సరం విద్యార్థులు అడ్మిషన్లు చేసుకునేందుకు కూడా జూలై 31వ తేదీ చివరి తేదీ అని చెప్పారు. మరిన్ని వివరాలకు స్థానిక అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ పరిశీలన

ఆదోని అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను మంగళవారం వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్ అహ్మద్ పరిశీలించారు. రూ.57.82 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన యంత్రాల పనితీరును కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. పప్పు దినుసులు, చిరుధాన్యాలు శుభ్రపరిచి ప్యాకింగ్ చేసేందుకు అనువుగా ఉంటుందని తెలుసుకుని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యార్డు కార్యదర్శి వై.రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని సెంట్రల్: పేద మధ్యతరగతి విద్యార్థులు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన తన నివాసంలో డిగ్రీ కళాశాలకు సంబంధించిన కోర్సుల వివరాల కరపత్రాలు ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకుడు న్యూటన్‌రాజు పాల్గొన్నారు.

రెండు పంటలకు నీరు అందిస్తాం


రాయల చెరువు నుంచి నీటిని విడుదల చేయడానికి రెగ్యులేటర్‌కు పూజలు చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబళం రాయల చెరువు ద్వారా ఏడు గ్రామాల రైతులకు రెండు పంటలకు సాగునీరు అందిస్తామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రాయల చెరువు కింద ఉన్న వరి మొలక వేసుకునేందుకు చెరువు నుంచి సాగునీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని కోరిన నేపథ్యంలో నాయకులు మంగళవారం చెరువుకు పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు కింద ఉన్న ఏడు గ్రామాల రైతులకు చెందిన సుమారు రెండు వేల ఎకరాలకు సంబంధించి సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పులికనుమ ప్రాజెక్టు ద్వారా రాయల చెరువుకు నీటిని సరఫరా చేసి సమృద్ధిగా సాగునీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు రవీంద్ర, గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప, ఎల్ఎల్‌సి సిబ్బంది, నాయకులు లింగన్నగౌడ్, బొడ్డన్న, రాముడు పాల్గొన్నారు.

గంగావతిలో మంత్రాలయం వాసుల ధర్నా


గంగావతిలో ధర్నా చేస్తున్న మంత్రాలయం వాసులు

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రం గంగావతి తాలుకా అనెగొందిలోని నవబృందావన క్షేత్రం విషయంలో ఉత్తరాధి మఠం, మంత్రాలయం మఠం మధ్యల తరచు విభేదాలు తలెత్తుతునే ఉన్నాయి. శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులకు నవబృందావన క్షేత్రంలో ప్రవేశానికి హక్కు లేదంటూ గతంలోనే ఉత్తరాధి మఠం అధికారులు కోర్టులను ఆశ్రయించడం జరిగింది. ఇదే కోవలోనే ఇటీవల మధ్వ మత పూర్వపు పీఠాధిపతి జయతీర్థుల మూలబృందావన విషయంలో తగాదాలు తల్లెత్తాయి. నవబృందావన క్షేత్రంలో జయతీర్థుల మూలబృందావనం లేదని ఉత్తరాధి మఠం అధికారులు వాదనకు దిగ్గారు. అయితే మంత్రాలయం శ్రీ మఠం పీఠాధిపతులు జయతీర్థుల మూలబృందావనం అక్కడే ఉందంటూ ఆందోళనకు దిగారు. మంగళవారం శ్రీ మఠం తరుపున గంగావతిలో శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ.నరసింహమూర్తి, అధికారులు, అర్చకులు, గ్రామస్తులు, భక్తులు శాంతియుత ఆందోళన చేపట్టారు. గంగావతి సర్కిల్‌లో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న గంగావతి రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని వినతి పత్రం స్వీకరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం రూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ ఎస్ఐ సోమశేఖర్ మంగళవారం వివరాలు తెలిపారు. మండల పరిధిలోని చిలకలడోణకు చెందిన బీవై బాలనాగన్న, మంత్రాలయం రామచంద్రనగర్‌కి చెందిన ఈడిగ జయరాముడు, ఆదోని పట్టణానికి చెందిన బోయ రాముడు, కోసిగికి చెందిన పీరసాబ్‌లు అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నారు. సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ.55 వేల విలువ చేసే 1038(90 యంఎల్) ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టెబుల్ గోపాల్, లింగప్రసాద్, చంద్రమౌళి, రామచంద్రుడు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీటీ సహకారంతో ఇంటి నిర్మాణాలు


మాట్లాడుతున్న ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు 25 కుటుంబాలకు ఇళ్లను నిర్మించారు. ఈ మేరకు మంగళవారం ఇళ్లను స్పెయిన్ దేశస్తులు, ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతి కోసం ఆర్డీటీ సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్పెయిన్ దేశస్తుల సహాయార్థం ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించి ఇచ్చినట్లు తెలిపారు. ఈమేరకు గ్రామ ప్రజలు, లబ్ధిదారులు స్పెయిన్ దేశస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంస్థ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

కౌతాళం: మండల పరిధిలోని సుళేకేరి గ్రామం బస్టాండ్ వద్ద కల్వర్టు కొంత మేరకు కూలిపోయి రాకపోవకలు అంతరాయం ఏర్పడింది. మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి విన్నపించుకోగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సమస్యను పరిష్కరించాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. దీంతో మంగళవారం కల్వర్టుకు పైపులు వేసి పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో ప్రయాణికులు, సుళేకేరి గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

తాయమ్మ దేవికి విశేష పూజలు

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామం వడ్డే వీధిలో వెలసిన శ్రీ తాయమ్మ దేవి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. మంగళవారం గ్రామ ప్రజలు అమ్మ వారి విగ్రహాన్ని కలశాలు, మేళతాళాలతో ఊరేగింపు తుంగభద్ర నది వరకు తీసుకెళ్లి గంగపూజలు నిర్వహించారు. యథావిధిగా ఊరేగింపుగా ఆలయం చేరుకుని అమ్మవారి విగ్రహాన్ని కొలువుంచి అభిషేకాలు, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి చల్లంగా చూడాలని అమ్మవారిని గ్రామ ప్రజలు వేడుకున్నారు.

కౌతాళంలో పారిశుద్ధ్య పనులు

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలో పారిశుద్ధ్య పనుల్ని ముమ్మరంగా చేపట్టారు. వీధుల్లో ఎలాంటి చెత్తచెదారం లేకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. డ్రైనేజీల్లో పెరుకుపోయిన పూడిక, చెత్తచెదారాన్ని తొలగిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ప్రజలు ఇంటి పన్నులను ఎప్పటికప్పుడు చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఏ సమస్యలున్నా పంచాయతీ అధికారులు, లేదా తనకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రజలకు మేలుకు చేస్తే ఆరోపణలా?

కౌతాళం: గ్రామ ప్రజలకు మేలు చేస్తే తెలుగుదేశం నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం విచారకరమని వల్లూరు గ్రామ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ మరేగౌడ్ అన్నారు. మంగళవారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబరు 134లో ప్రభుత్వ భూమి 5.82 ఎకరాలు ఉందన్నారు. ఈ భూమి ప్రక్కలోనే నా సొంత పట్టాదారు భూమి ఉందని తెలిపారు. గ్రామస్తుల కోరిక మేరకు ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేస్తే తెలుగుదేశం నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న దృశ్యం

ఆదోని అర్బన్: పేదల సంక్షేమం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందని ఆదోని పట్టణ కన్వీనర్ వెల్లాల మధుసూదనశర్మ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక సచివాలయంలో 11, 20, 26, 27 మున్సిపల్ వార్డుల్లో చైర్‌పర్సన్ బోయ శాంతమ్మ, కౌన్సిలర్ వాసీం, వార్డు ఇన్‌చార్జులు మధు, హాజీబాషా అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమంపై వార్డు కన్వీనర్లకు, వలంటీర్లు, గృహసారథులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్లాల మధుసూదనశర్మ మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రభుత్వం తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మనమందరం పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి తెలియజేయాద్దామని చెప్పారు. కార్యక్రమంలో వలంటీర్లు, టౌన్ ఇన్‌చార్జులు అమిత్, సందీప్, నాయకులు బోయ నాగేంద్ర, మహబూబ్‌బాషా, నూర్‌బాషా, షాహీన, మారుతి, వెంటకేష్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మున్సిపాలిటీలోని నాలుగు వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 5, 6, 16 వార్డుల్లో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందిన కుటుంబాల వివరాలు నమోదు చేసుకున్నారు.

- స్థానిక 5, 6, 16 సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తనిఖీ చేసి అక్కడి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఎంఐజీ వీధిలోని రాంజల పార్కు, మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేసి వాటర్ వర్క్స్ లైన్‌మెన్లు, కిందిస్థాయి సిబ్బందితో చర్చించారు. పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు.

ఆదోని రూరల్: అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎంపీడీఓ గీతావాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం సంతెకూడ్లూరు, పెద్దహరివాణం గ్రామాల్లో ఆమె సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో పర్యటించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ నాగరాజు, వీఆర్వో చిన్నఈరన్న, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మండల పరిధిలోని కాచాపురం 1, 2, రాంపురం గ్రామాల్లోని సచివాలయాల్లో జేసీఎస్ కన్వీనర్ విశ్వనాథ్‌రెడ్డి, మండల ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి, గృహ సారథులకు జగనన్న సురక్ష పథకంపై అవగాహన కల్పించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని విశ్వనాథ్‌రెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగి సచివాలయం –2 పరిధిలోని కొత్తపేట, మారెమ్మ గుడి, కాశమ్మ గడ్డ, ఎస్సీ కాలనీ, గుడిసెల్లో, జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీపీ ఈరన్న ప్రారంభించారు. ఆయా సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ సంక్షేమ పథకాలు వస్తున్నాయా.. లేదా అని ఆరా తీశారు. 11 అంశాలపై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ తిక్కస్వామి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వీఆర్వో మయూరి, వెల్ఫేర్ అసిస్టెంట్ రజిత తదితరలు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : అర్హులందరికీ జగనన్న సంక్షమ పథకాలు అందించడమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందని గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు యల్లప్ప అన్నారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయం – 1 పరిధిలోని కుటుంబాలను మంగళవారం వీఆర్ఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు మేదర్‌గేరిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆదోని టౌన్: పట్టణంలోని 36వ వార్డు మేదర్‌గేరిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. అన్ని విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

దున్నపోతు పొడిచి బాలుడికి గాయాలు

ఆదోని అర్బన్: ఎమ్మిగనూరు మండలం పెద్దమారువీడు గ్రామానికి చెందిన రాఘవేంద్ర అనే బాలుడిని మంగళవారం దున్నపోతు పొడవంతో గాయాలయ్యాయి. వెంటనే బంధువులు ఆ బాలుడిని ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆషాఢ మాసం యల్లమ్మవ్వ రెండో వారం ఉన్నందున యల్లమ్మవ్వను దర్శించుకునేందుకు బంధువులతో పాటు బాలుడు వచ్చాడు. ఆ ప్రాంతంలో బాలుడిని దున్నపోతు పొడవడంతో గాయపడ్డాడు.

వర్షం కోసం పూజలు

ఆదోని టౌన్: వరుణ దేవుడి కరుణ కోసం చిన్నారులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణవాసుల ఆరాధ్యదైవం రణమండల ఆంజనేయస్వామి కొండపై నుంచి వంద కలశాలతో చిన్నారుల చేత, వంద చలువ బిందెలను తీసుకొని శుక్రవారపేటలోని మారెమ్మవ్వ ఆలయం సన్నిధికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చలువ బిందెలతో అమ్మవారికి అభిషేకం చేశారు. పూజలు పట్టణ వాసులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ తనిఖీ

కర్నూలు (న్యూసిటీ): జిల్లా తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో ఆదోనిలో కూరగాయల మార్కెట్‌ను తనిఖీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లోని ఆయా కూరగాయల దుకాణాలను తనిఖీ చేసి తూకం, కాటా రాళ్లను పరిశీలించామన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆదోని కూరగాయల మార్కెట్‌ను పరిశీలించినట్లు చెప్పారు.

బడి బస్సును నడపాలి

పెద్దకడబూరు : పాఠశాలలకు వెళ్లేందుకు అనుగుణంగా ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం మండల పరిధిలోని కంబలదిన్నె దగ్గర ఎమ్మిగనూరు ప్రధాన రహదారిపై విద్యార్థులు ధర్నా చేశారు. దీంతోరాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా విద్యార్థులు సల్మాన్‌రాజు వీరేష్, రమేష్ మాట్లాడుతూ జాలవాడి, కంబలదిన్ని, మంత్రాలయం మండలం మాలపల్లి విద్యార్థులు బస్సులు లేక పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఎస్ఐ శ్రీనివాసులు అక్కడికి చేరుకొని ఎమ్మిగనూరు డిపో మేనుజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని ఎస్ఐ హామీ ఇవ్వడంతో విద్యార్థులు నిరసన విరమించారు.

బెంగళూరుకు వెళ్లి ఈకేవైసీ చేసిన వలంటీర్


బెంగళూరులో జంపాపురం వాసులకు ఈకేవైసీ చేస్తున్న వలంటీర్ మన్యం శివశంకర్

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన వలంటీర్ మన్యం శివశంకర్ తనకు కేటాయించిన 50 కుటుంబాల్లో కొందరు అమ్మ ఒడి అర్హత పొందిన లబ్ధిదారులు బెంగళూరులో ఉండడంతో అక్కడికి వెళ్లి ఈకేవైసీ చేయించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 28న నాల్గవ విడత అమ్మ ఒడి కింద బడికి వెళ్తున్న తల్లుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. ఈమేరకు ప్రభుత్వం అర్హత పొందిన లబ్ధిదారులకు ఈనెల 27 లోగా ఈకేవైసీ పూర్తి చేయించాలని ఆదేశాల జారీ చేసింది. గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సమాచారం అందించారు. అయితే పనులు మానుకుని రావడం కష్టం అవుతోందని లబ్ధిదారులు తెలుసపగా స్పందించిన వలంటీర్ బెంగళూరు పట్టణానికి వెళ్లి ఈకేవైసీ పూర్తి చేశారు. దీంతో లబ్ధిదారులతోపాటు, గ్రామ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు వలంటీర్‌ను అభినందించారు.

2024లోనూ జగనన్నే ముఖ్యమంత్రి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఆదోని టౌన్: 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లోనూ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర ముస్లిం మైనార్టీల సీఎం అడ్వైజర్ అబీబుల్లా దీమా వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముస్లింలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డితో కలిసి మైనార్టీల సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు ముస్లిం మతపెద్దల అభిప్రాయాలను సేకరించారు. ముస్లింల అభివృద్ధికి పెద్దపీట వేసిన జగనన్నకు ముస్లింలు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు, చైర్మన్‌లు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ టీవీ స్వాధీనం...దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న టీవీతోపాటు దొంగలు అరెస్టును చూపుతున్న ఎస్ఐ

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలోని తహసీల్దార్ కార్యాలయంలో చోరీకి గురైన ఎల్ఈడీ టీవీని పోలీసులు స్వాధీనం చేసుకుని దొంగలను అరెస్టు చేశారు. కోసిగి సీఐ ఏరిషావలి ఆధ్వర్యంలో 1.50లక్షల విలువైన ఎల్ఈడీ టీవీతోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ మాట్లాడారు. కోసిగి గ్రామానికి చెందిన షేక్ ఫరిద్, మహమ్మద్ షఫీ, కటికే షబ్బీర్ ఈ దొంగనం చేసినట్లు తెలిపారు. కోసిగికి చెందిన వీరు తాగుడుకు, జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో ఆదివారం రెక్కి నిర్వహించి సోమవారం తెల్లవారు జామున మోటార్ సైకిళ్లపై వచ్చి గ్రామానికి చివరిలో ఉన్న తహసీల్దార్ కార్యాలయంలోకి ప్రవేశించి తాళాలు పగలగొట్టి 42 ఇంచుల ఎల్ఈడీ టీవిని సీపీయూ తదితర పరికరాలను దోచుకెళ్లారన్నారు. తిమ్మపురం చెరువు వద్ద పరికరాలను సంచుల్ని దాచిపెట్టి ఉదయం వాటిని ఆదోనిలో అమ్మడానికి పోతుండగా వారిని పట్టుకుని అరెస్టుచేశామన్నారు. కేసును 24గంటల్లోపు ఛేదించినందుకు తనతోపాటు సీఐ, పోలీసులు పులిరాజు, రంగన్న, వీరేష్, మద్దిలేటి, నరేంద్ర, నాగరాజులను ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించాలి

కౌతాళం: తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏరిగేరి గ్రామస్తులు ఆదోని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆదోని నుంచి కౌతాళంకు వస్తున్న తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు, అక్కడికి చెరుకున్న ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి గ్రామస్తులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి ఎమ్మెమ్యే బాలనాగిరెడ్డితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.